## నేడు సీఎం జగన్ రాక

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నగరానికి రానున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరం నుంచి మధ్యాహ్నం 4.25 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఆర్కే బీచ్‌రోడ్డులోని నేవల్ కోస్టల్ బ్యాటరీకి చేరుకుంటారు. అక్కడి నుంచి ఏయూ కన్వెన్షన్ హాల్‌లో జరిగే డీసీసీబీ చైర్మన్, నగర వైసీపీ అధ్యక్షుడు కోలా గురువులు కుమారుడి వివాహానికి హాజరవుతారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన తర్వాత నేవల్ కోస్టల్ బ్యాటరీకి వెళ్లి హెలికాప్టర్‌లో సాయంత్రం ఐదు గంటలకు ఎయిర్‌పోర్టుకు వెళతారు. 5.20 గంటలకు విమానంలో విజయవాడ వెళ్లిపోతారు.

## అరకులోయలో నారా భువనేశ్వరికి ఘన స్వాగతం



అరకులోయకు మంగళవారం రాత్రి చేరుకున్న భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న దొన్నుదొర, తదితరులు

పాడేరు/ అరకులోయ, ఫిబ్రవరి 27:

నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా పర్యటన ముగించుకుని రాత్రి 7.30 గంటలకు అరకులోయ చేరుకున్నారు. ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అరకు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి దొన్నుదొర దంపతులు పుష్పగుచ్ఛం అందజేశారు. అరకులోయ, డుంబ్రిగుడ మండలాల పార్టీ అధ్యక్షులు శెట్టి బాబూరావు, సుబ్బారావు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి భువనేశ్వరికి స్వాగతం పలికారు. కాగా బుధవారం ఆమె అరకులోయ మండలం మాదల పంచాయతీ మునిసిరిగుడ, పాడేరు మండలం ఆడారిమెట్ట, కిండంగి, మండల కేంద్రం జి.మాడుగులలో పర్యటించి, చంద్రబాబు అరెస్టుతో మనస్తాపం చెందిన ప్రాణాలు వదిలిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శిస్తారు. పార్టీ పరంగా ఆర్థిక సాయం అందిస్తారు. అనంతరం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం చేరుకుని రాత్రి బస చేస్తారు.

# అడ్డగోలుగా చేపల చెరువులు



రైతుల నుంచి వ్యవసాయ భూములు కౌలుకు

- అనుమతులు లేకుండా పంట పొలాల్లో చెరువులు తవ్వకం
- పంట కాలువల నుంచి నీరు మళ్లింపు
- చేపలకు ఆహారంగా మాంసం వ్యర్థాలు
- చేపలు పట్టిన తరువాత వాగుల్లోకి వ్యర్థ జలాలు విడుదల
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



చేపల చెరువులో తేలియాడుతున్న బ్రాయిలర్ కోళ్ల వ్యర్థాలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 27:

**మండలంలోని పలు గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూముల్లో చేపల చెరువులను ఏర్పాటు చేశారు. పంట కాలువల నుంచి అక్రమంగా చేపల చెరువులకు నీరు మళ్లిస్తున్నారు. కొంతమంది నిర్వాహకులు చేపలకు ఆహారంగా చికెన్ వ్యర్థాలను వేస్తున్నారు. చేపలు పట్టిన తరువాత వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా గెడ్డలు, వాగుల్లోకి విడిచిపెడుతున్నారు. వీటిపై అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.**



చికెన్ షాపుల నుంచి డ్రమ్ముల్లో తీసుకువచ్చిన వ్యర్థాలు

వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్చాలంటే నిబంధనల ప్రకారం పలు ప్రభుత్వ శాఖలకు దరఖాస్తులు చేసుకోవాలి. తొలుత ఆయా భూములను అధికారులు సందర్శించాలి. నీరు ఎక్కడి నుంచి తీసుకుంటారు? చేపల పట్టుబడి అనంతరం చెరువును ఖాళీ చేయడానికి వ్యర్థ జలాలను బయటకు ఎలా పంపుతారు? ఆ నీటి వల్ల భూగర్భ జలాలు కలుషితం అయ్యే ప్రమాదం వుందా? తదితర విషయాలను పరిశీలించాలి. అనంతరం పరిసర గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని సేకరించాలి. అందరి ఆమోదం పొందినట్టు తీర్మానం చేయాలి. దీనిని మత్స్యశాఖ ద్వారా జిల్లా కలెక్టర్ ఆమోదం కోసం పంపాలి. అనంతరం చేపల చెరువుల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలి. కానీ దేవరాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎటువంటి నిబంధనలు పాటించకుండా, ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొందకుండా పంట భూములను చేపల చెరువులుగా మార్చేశారు. చేపల వ్యాపారానికి విశాఖ నగరం ప్రధాన మార్కెట్ కావడంతో గోదావరి ... మిగతా 8వ పేజీలో

# వైసీపీ నేతల భూదందాపై విచారణ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**భూ సమీకరణను అడ్డంపెట్టుకొని కొంతమంది వైసీపీ నాయకులు పాల్పడిన భూ దందాపై అధికారులు ఎట్టకేలకు విచారణ చేపట్టారు. టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ గత ఏడాది ఏప్రిల్‌లో ఆధారాలతో సహా విజయవాడలో సీఐడీ అధికారులకు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నేతల భూ కబ్జాలపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై రాష్ట్ర భూపరిపాలన విభాగం (సీసీఎల్ఏ) అధికారులు స్పందించి భూ సమీకరణకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని జిల్లా రెవెన్యూ అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. మరోవైపు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కూడా వివరాలు సేకరిస్తున్నారు.**

- సమగ్ర నివేదిక కోరిన సీసీఎల్ఏ అధికారులు
- ఏసీబీ సైతం వివరాలు సేకరణ
- మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు, 'ఆంధ్రజ్యోతి' కథనాలపై ఎట్టకేలకు స్పందించిన ఉన్నతాధికారులు

భూ సమీకరణ మాటున అక్రమాలపై ఆరా!



అనకాపల్లి మండలం గోపాలపురంలో వీఆర్‌ఓ కుటుంబ సభ్యుల పేరున ఉన్న ప్రభుత్వ స్థలం ఇదే...

అనకాపల్లి మండలం కోడూరు, గోపాలపురం, కుంచంగి, రొంగలివానిపాలెం, వేటజంగాలపాలెం, సత్యనారాయణపురం, సంపతిపురం, పాపయ్యసంతపాలెం, పాపయ్యపాలెం, మామిడిపాలెం, గొలగాం, కొండుపాలెం, తదితర గ్రామాల్లో జగనన్న కాలనీల ఏర్పాటుకు, పారిశ్రామిక అవసరాల కోసం 1,038 ఎకరాలను సమీకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంతవరకు 900 ఎకరాలకుపైగా భూములను సేకరించారు. ఈ సందర్భంగా కొన్ని గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది, స్థానిక వైసీపీ నాయకులు కుమ్మక్కై ప్రభుత్వ భూములు సాగులో వున్నట్టు రికార్డుల్లో కొంతమంది పేర్లు చేర్చారు. ఉదాహరణకు కోడూరు రెవెన్యూ పరిధి సర్వే నంబరు 20లో ఏకంగా 38 ఎకరాల 9 సెంట్ల ప్రభుత్వ బంజరు భూములను వైసీపీ నాయకులుతమ కుటుంబ సభ్యుల పేర్ల మీద రెవెన్యూ రికార్డుల్లో రాయించుకున్నారు. గోపాలపురంలో ఖాతా నంబరు 100లో 21వ సర్వే నంబరులోని ఒక ఎకరా 35 సెంట్ల ప్రభుత్వ బంజరు భూమిని వీఆర్‌ఓ ఒకరు తన కుటుంబ సభ్యుల పేరుతో రాసుకున్నారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ 2023 ఏప్రిల్‌లో ఆధారాలతో సహా విజయవాడలో సీఐడీ అధికారులకు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు గుట్టుగా సాగించిన భూదందాపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై ఎట్టకేలకు స్పందించిన రాష్ట్ర భూపరిపాలన విభాగం (సీసీఎల్ఏ) అధికారులు.. అనకాపల్లి జిల్లాలో భూసమీకరణ చట్టం ప్రకారం ఇంతవరకు ఎంతమంది రైతుల నుంచి, ఎన్ని ఎకరాలు సమీకరించారో పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా రెవెన్యూ అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. మరోపక్క అనకాపల్లి మండలంలో వైసీపీ నాయకులు, రెవెన్యూ ఉద్యోగులు భూసమీకరణ సందర్భంగా సాగించిన అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ కూడా దృష్టి సారించినట్టు సమాచారం. అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దారు కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. కోడూరు, గోపాలపురంతోపాటు మిగిలిన 11 గ్రామాల్లో చేపట్టిన భూ సమీకరణ వివరాలను కూడా సేకరిస్తున్నట్టు సమాచారం.

## ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లు కలెక్టర్, ఎస్పీ పరిశీలన



నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలు) భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఎలమంచిలిలో గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నక్కపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, నర్సీపట్నంలో అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. భద్రతా ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ ముందు రోజు ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ కోసం ఎలమంచిలి డిగ్రీ కళాశాల పక్కనున్న క్రీడా మైదానాన్ని ఎంపిక చేసినట్టు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్‌వో) కె.మనోరమ చెప్పారు. నక్కపల్లి జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లకు ఎంపిక చేసిన గదుల్లో సున్నం వేయించి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఈఆర్‌వో గీతాంజలిని కలెక్టర్ ఆదేశించారు. నర్సీపట్నం ప్రభుత్వ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచే గదుల వద్ద సీసీ కెమెరాలు అమర్చాలని ఆర్డీవో జయరామ్‌కు సూచించారు.



విశాఖలోని ఒక పరీక్షా కేంద్రం వద్ద టెట్ అభ్యర్థులు

## ప్రశాంతంగా టెట్

- తొలిరోజు 86.8 శాతం హాజరు

ఆరిలోవ, ఫిబ్రవరి 27:

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. మంగళవారం నగరంలోని ఏడు కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహించారు. తొలిరోజు పరీక్షకు 4,420 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా...3837 (86.8 శాతం) మంది హాజరయ్యారు. 583 మంది మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ పలు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

# కొనసా...గుతున్న బీఎన్ రోడ్డు పనులు

చోడవరంలో మందకొడిగా సీసీ రోడ్డు నిర్మాణం

- తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్
- నిత్యం ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



కొత్తూరు జంక్షన్‌లో సీసీ రోడ్డు నిర్మాణం

చోడవరం, ఫిబ్రవరి 27:

**భీమిలి- నర్సీపట్నం (బీఎన్) రోడ్డు అభివృద్ధి పనులు చోడవరం పట్టణంలో నత్తనడకన సాగుతున్నాయి. సగం రహదారిని మూసివేయడంతో మిగిలిన సగం రోడ్డులో నుంచే వాహనాలు వెళ్లాల్సి వస్తున్నది. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. రద్దీ వేళల్లో వాహనాల రాకపోకలు స్తంభించి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.**

నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తవుతా యని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాగా రోడ్డు పనులు జరుగుతున్న చోట తరచూ ట్రాఫిక్ స్తంభిస్తున్నది. ఎక్కువసేపు వాహనాలు నిలిచిపోతే తప్ప పోలీసులు స్పందించడలేదు.

భీమిలి- నర్సీపట్నం రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా చోడవరం పట్టణంలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ ఇటీవల పనులు చేపట్టారు. ఇందుకోసం రోడ్డును రెండు భాగాలు విభజించి ఒక వైపు పనులు నిర్వహిస్తున్నారు. దీంతో మిగిలిన సగంలోనే అటుఇటు వాహనాలు వెళ్లాల్సి వస్తున్నది. సీసీ రోడ్డు నిర్మాణ పనులు చాలా నెమ్మదిగా సాగుతున్నాయి. రోజుకి నాలుగైదు అడుగులకు మించి కాంక్రీటు వేయడంలేదు. ఇలా అయితే పట్టణంలో రోడ్డు



స్తంభించిన వాహనాల రాకపోకలు

## ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా డీవీ సూర్యనారాయణరాజు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



డీవీ సూర్యనారాయణరాజుకు పూలమాల వేసి శుభాకాంక్షలు తెలుపుతున్న వైసీపీ శ్రేణులు

కోటవురట్ల, ఫిబ్రవరి 27:

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఏపీ ఎంఎస్ఎంఈ) చైర్మన్‌గా డీవీ సూర్యనారాయణరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తంగేడు రాజుల కుటుంబానికి చెందిన సూర్యనారా యణరాజు గతంలో శాసన మండలి సభ్యుడిగా పనిచేశారు. కాగా ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా సూర్యనారాయణరాజు నియమితులైన విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు సిద్దాబత్తుల నాగేశ్వరరావు, చామంతుల శ్రీనివాసరావు, కోటవురట్ల సర్పంచ్ అనిల్‌కుమార్, గొట్టివాడ సర్పంచ్ రమేశ్, తదితరులు తంగేడులో ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు.



# అరాచక పాలనను అంతమొందించాలి

టీడీపీ, జనసేన కూటమి ప్రధాన లక్ష్యం ఇదే

- ఇరు పార్టీల కేడర్ 50 రోజులు కష్టపడితే ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుంది
- మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ
- టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ. వేదికపై బుద్ద నాగజగదీశ్, డాక్టర్ నారాయణరావు, తదితరులు

అనకాపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందించి, ప్రజలకు సుపరిపాలన అందించాలన్నదే టీడీపీ, జనసేన కూటమి ప్రధాన లక్ష్యమని మాజీ మంత్రి, అనకాపల్లి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ టీడీపీ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకపాలనను తన 35 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదన్నారు. 2019 ఎన్నికల్లో ఒక్క చాన్స్ అంటూ జగన్ ఓట్లు అడుగుతున్నప్పుడే ఆయన మనస్తత్వాన్ని గ్రహించి వైసీపీ నుంచి బయటకు వచ్చేశానని చెప్పారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలంటే టీడీపీ-జనసేన కలిసి పోటీ చేయాలని ఇరు పార్టీల శ్రేణులే కాకుండా అత్యధిక శాతం ప్రజలు కూడా కోరుకుంటున్నారని చెప్పారు. అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సూచించడంతో ఎన్నికల బరిలో దిగుతున్నట్టు ఆయన వెల్లడించారు. ఉభయ పార్టీల నాయకులు, కార్యకర్తలు 50 రోజులు కష్టపడి పనిచేస్తే రాష్ట్రంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనకాపల్లి సీటును జనసేనకు కేటాయించడంతో మనస్తాపం చెందిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందను కలిసి తనకు సహకరించాలని కోరుతానని కొణతాల చెప్పారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టీరామారావు అంటే ఎంతో అభిమానమని, జనసేన పార్టీలో చేరి అనకాపల్లి నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సందర్భంగా ఈ విషయాన్ని బయటకు చెప్పుకునే అవకాశం వచ్చిందని అన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ శ్రీనివాస్

**అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27:** జాతీయ రహదారిపై కొత్తూరు జంక్షన్ సమీపంలో సోమవారం రాత్రి ఆగి వున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ పి.ఫైడపునాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. కశింకోట మండలం కన్నూరుపాలెం గ్రామానికి చెందిన కూండ్రపు శ్రీనివాస్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పెందుర్తి నుంచి కన్నూరుపాలేనికి ఖాళీ లారీతో వస్తుండగా కొత్తూరు జంక్షన్ వద్ద ఆగి ఉన్న మరో లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో లారీ క్యాబిన్‌లో చిక్కుకుపోయిన శ్రీనివాస్ కుడికాలు తెగిపోయింది. ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తమ్ముడు గోవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

## కోడి పందేలపై పోలీసులు దాడి

**అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27:** పట్టణానికి సమీపంలోని సుబ్రహ్మణ్యం కాలనీలో మంగళవారం మధ్యాహ్నం కోడి పందేలపై పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులు, రూ.1,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం

**పరవాడ, ఫిబ్రవరి 27:** మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన చింతకాయల బంగార్రాజు మంగళవారం రాత్రి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి తొమ్మిది క్వార్టర్ బాటిళ్లను ఇంటికి తీసుకువెళుతుండగా దారిలో ఎస్ఐ మల్లేశ్వరరావు అడ్డగించి సోదా చేశారు. అతని నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## 1900 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

» వాలాబు, రైవాడ జలాశయ పరిసరాల్లో విస్తృత తనిఖీలు

**దేవరాపల్లి, ఫిబ్రవరి 27:** నాటు సారా స్థావరాలపై పోలీసులు మంగళవారం విస్తృత స్థాయిలో దాడులు చేశారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు ఆధ్వర్యంలో పోలీసులు వాలాబు గిరిజన గ్రామంలో ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. వాలాబు పంచాయతీ పూలగరువులో 300 లీటర్లు, రైవాడ జలాశయం గేటు ఆనుకొని జీనబాడు గ్రామ పరిసరాల్లో 1600 లీటర్ల బెల్లం పులుసు ఉన్నట్టు గుర్తించి వాటిని ధ్వంసం చేశారు. రెండు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాలాబు గిరిజనులతో సమావేశం నిర్వహించి సారా తయారీ, రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో కె.కోటపాడు సీఐ స్వామినాయుడు, చోడవరం సీఐ శ్రీనివాసరావు, కొత్తకోట సీఐ అప్పలనాయుడు, దేవరాపల్లి ఎస్ఐ నాగేంద్ర, వీఆర్వో దొర, పోడెల బుజ్జి, సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖలో యువతి కిడ్నాప్‌నకు యత్నం

» ఒంటరిగా ఆటో ఎక్కిన యువతిని అపహరించేందుకు డ్రైవర్ యత్నం
» భయంతో ఆటో నుంచి దూకేసిన యువతి
» విమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు

**విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):** నగరంలో ఒక యువతిని కిడ్నాప్ చేసేందుకు విఫలయత్నం చేశాడో ఆటో డ్రైవర్. తాను దిగాల్సిన చోట ఆపకుండా డ్రైవర్ ముందుకు తీసుకువెళ్లిపోతుండడంతో ఆందోళనకు గురై ఆమె ఆటో నుంచి కిందకు దూకేసింది. స్వల్పగాయాలైన యువతిని ఆమె స్నేహితులు విమ్స్‌లో చేర్పించారు. దీనికి సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మద్దిలపాలెం సమీపంలోని క్రాంతినగర్‌కు చెందిన కొల్లూరు లహరి (26) సంగం-శరత్ సమీపంలోని ఒక ద్విచక్ర వాహనాల షోరూమ్‌లో పనిచేస్తోంది. సోమవారం విధులకు వెళ్లిన లహరి మధ్యాహ్న సమయంలో షోరూమ్ నుంచి ఆరిలోవలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. కొత్త మోడల్ వాహనాన్ని లాంచింగ్ చేయాల్సి ఉన్నందున వేగంగా షోరూమ్‌కు రావాలంటూ లహరికి సిబ్బంది ఫోన్ చేశారు. దీంతో సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆమె ఆరిలోవ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంది. అక్కడకు షోరూమ్ ఒక కిలోమీటరు దూరం ఉంటుంది. అయితే షోరూమ్ సిబ్బంది చెప్పిన సమయం దాటిపోతుండడంతో అక్కడ నుంచి మరో ఆటో ఎక్కింది. డ్రైవర్ ఆటోలోని అద్దం నుంచి తదేకంగా వెనుక సీట్లో కూర్చున్న లహరిని చూడడం, నవ్వుతూ మాటలు కలపడంతో అతని వ్యవహారశైలిపై ఆమెకు అనుమానం వచ్చింది. అదే సమయంలో షోరూమ్ రావడంతో ఆటో ఆపాలని లహరి కోరింది. అయినా ఆటో ఆపకుండా ముందుకుపోనివ్వడంతోపాటు 'నిన్ను గాజువాక తీసుకువెళతాను. అక్కడ మంచి పార్టీ ఉంది. వారికి అప్పగిస్తాను' అని చెప్పడంతో ఆందోళనకు గురైన ఆమె రైల్వే ఆస్పత్రి సమీపంలో వెళుతున్న ఆటో నుంచి కిందకు దూకేసింది. ఈ ఘటనలో బాధితురాలికి ముఖంపై గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్ ఆటోను ఆపాడు. బాధితురాలు తన ఫోన్ నుంచి స్నేహితులకు ఫోన్ చేయడంతో వారంతా వచ్చి ఆమెను సమీపంలోని రైల్వే ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విమ్స్‌కు తరలించారు. ఆటో డ్రైవర్ అక్కడ నుంచి వెళ్లిపోగా, బాధితురాలి స్నేహితులు సెల్‌తో ఆటోతోపాటు డ్రైవర్ ఫొటోలు తీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసులు దీనిపై కేసు నమోదుచేసి ఆటో డ్రైవర్ కోసం గాలించారు. గాజువాకలోని బీసీ రోడ్డుకు చెందిన శాంతికృష్ణగా గుర్తించారు. పాతగాజువాక ఆటోస్టాండ్‌లో సర్వీసు చేస్తుంటాడని టూటౌన్ సీఐ తిరుమలరావు తెలిపారు. కృష్ణను అదుపులోకి తీసుకుని విచారించామని, తాను యువతిని కిడ్నాప్ చేస్తానని అనలేదని, షోరూమ్ దాటిపోతోందని ఆమె చెప్పడంతో సడన్‌గా ఆటోను ఆపకూడదు కాబట్టి కొంచెం పక్కకు తీసి ఆపే ప్రయత్నంలో ఉండగా...ఆమె హఠాత్తుగా కిందికి దూకేసిందని చెబుతున్నాడన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

**కశింకోట, ఫిబ్రవరి 27 :** మండలంలోని తాళ్లపాలెం కూడలి వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించి సీఐ వినోద్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లపాలెం గ్రామానికి చెందిన కర్రి నూకరత్నం(43) మంగళవారం సాయంత్రం పొలంలో పనులు ముగించుకొని ఇంటికి వెళుతున్నది. కూడలి సమీపంలో రోడ్డు దాటుతుండగా ఎలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నది. దీంతో నూకరత్నం తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిందని వైద్యులు తెలిపారు. భర్త కర్రి నూకునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## 10 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

**కొత్తూరు, ఫిబ్రవరి 27:** అనకాపల్లి మండలం కూండ్రం గ్రామంలో యలమంచిలి నారాయణరావు అనే వ్యక్తి నుంచి మంగళవారం 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

**విస్సన్నపేటలో...**

**కశింకోట:** మండలంలోని విస్సన్నపేట గ్రామానికి చెందిన గొర్లి రామును అనే వ్యక్తి నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 120.00 |
| లైవ్ ధర | 140.00 |
| విత్ స్కిన్ | 250.00 |
| స్కిన్ లెస్ | 260.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 500 |
| విజయనగరం | 504 |
| శ్రీకాకుళం | 504 |

# ప్రభుత్వ భవనాలను పట్టించుకునే వారేరి?


నాతవరంలో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనం (ఇన్‌సెట్‌లో) భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపోతున్న దృశ్యం


శిథిలావస్థకు చేరుకున్న నాతవరం తహసీల్దార్ కార్యాలయ భవనం (ఇన్‌సెట్‌లో) భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్న దృశ్యం

» శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, గ్రంథాలయ భవనం
» శ్లాబ్ పెచ్చులూడి పడుతున్న వైనం
» పట్టించుకోని పాలకులు

**నాతవరం, ఫిబ్రవరి 27:** మండల కేంద్రం నాతవరంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్నాయి. శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. 1987లో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, గ్రంథాలయ భవనాలు నిర్మించారు. అప్పటి నుంచి వీటికి ఎటువంటి మరమ్మతులు చేయలేదు. ఈ భవనాలు శిథిలావస్థకు చేరి శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షం వస్తే శ్లాబ్ గుండా గదుల్లోకి నీరు వచ్చేస్తోంది. వీటి మరమ్మతులకు ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది, అలాగే గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

## 'విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి'


నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం రాత్రి సందర్శించిన అజేయ్‌బాబు

**నాతవరం, ఫిబ్రవరి 27:** వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యం పట్ల వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి టి.అజేయ్‌బాబు ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆయన నాతవరం మండలం చమ్మచింత ఎస్సీ బాలుర వసతి గృహం, నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహం, నాతవరం బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి టెన్త్ విద్యార్థుల ఆరోగ్యం బాగోకపోతే తనకు సమాచారం ఇవ్వాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా?, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహంలో స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. రికార్డులను కూడా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ రొంగల శివ, నాతవరం బాలికల వసతి గృహం మేట్రిన్ రత్నం, చమ్మచింత వసతి గృహం వార్డెన్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

# మోసానికి కేరాఫ్ వైసీపీ

» తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత ధ్వజం


గుడ్డు పగులగొడుతున్న అనిత

**విశాఖపట్నం, ఫిబ్రవరి 27:** అన్యాయం, మోసాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ అని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత విమర్శించారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల ఆమె మాట్లాడారు. దండు పాళ్యం బ్యాచ్‌తో జగన్ సిద్ధం సభలు నిర్వహిస్తున్నారన్నారు. జగన్ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. మద్యాన్ని నిషేధించి ఓట్లు అడుగుతానని చెప్పి ఇప్పుడు కొత్తగా మద్యం పాలసీ తెచ్చి నకిలీ మద్యంతో డబ్బు సంపాదిస్తున్నారన్నారు.

30 లక్షల కుటుంబాల లో చిచ్చుపెట్టారన్నారు. నకిలీ మద్యం తాగి ఎంతో మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే, రాష్ట్రానికి పోలవరం, రాజధాని హోదా, విశాఖ రైల్వే జోన్ లేకుండా సిద్ధం అంటూ సభలు ఎలా పెడుతున్నారని ఆమె ప్రశ్నించారు. విశాఖలో ప్రభుత్వ ఆస్తులు అని తాకట్టు పెట్టారన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే, ప్రజల అవయవాలను సైతం తాకట్టు పెడతారని ఎద్దేవా చేశారు.

**గుడ్డు మంత్రికి టికెట్ లేదు.. కేడరే లేదు..**

చేతకాని.. చేవలేని కోడిగుడ్డు మంత్రి అని ఎవరని అడిగినా ఠక్కున చెబుతారని గుడివాడ అమర్‌నాథ్‌ను ఉద్దేశించి అన్నారు. ఆయన టికెట్ పీకేసిన గుడివాడకు కనీసం నియోజకవర్గం లేదని, మంత్రిగా పని చేసిన ఆయనకు పార్టీలో కనీసం చోటు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తాను తెలుగు మహిళ అధ్యక్షురాలిగా పాయకరావు పేట నుంచి పోటీ చేస్తున్నానని, గుడి వాడ ఎక్కడ నుంచి ఎన్నికల బరిలో ఉంటారో చెప్పగలరా చెప్పాలని అన్నారు. వెటకారంగా మాట్లాడితే గుడ్డు పగులుద్ది అంటూ అనిత గుడ్డు పగుల గొట్టి ఆమె చూపారు.

**రాక్షస పాలన నుంచి విముక్తే ధ్యేయం**

**సింహాచలం:** రాష్ట్ర ప్రజలను రాక్షసుడి పాలన నుంచి విముక్తి చేయడమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన కూటమి రానున్న ఎన్నికల్లో ఉమ్మడి వ్యూహాలతో కృషి చేస్తుందని వంగలపూడి అనిత అన్నారు. కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం ఆమె సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా టీడీపీ, జనసేన నేతలు కొన్ని త్యాగాలకు సిద్ధం కావాలన్నారు. ఎన్నికల్లో సీట్లు దక్కని వారికి అధినేతలు న్యాయం చేస్తామని ఇప్పటికే ప్రకటించారని, ఈ నేపథ్యంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు.

# 'ఉక్కు'లో ఉద్రిక్తత

» బయోమెట్రిక్ అమలుపై వివాదం
» తమ సమస్యలు పరిష్కరించిన తరువాతే అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్
» వచ్చే నెల 8వ తేదీ నుంచి అమలు చేస్తామంటూ యాజమాన్యం ఉత్తర్వులు
» పర్సనల్ డైరెక్టర్ ఛాంబర్‌లో బైఠాయించిన సంఘ నాయకులు
» అడ్మిన్ భవనం వద్ద కార్మికుల ధర్నా
» రాత్రి 12 గంటలకు కూడా కొనసాగుతున్న నిరసన కార్యక్రమం


ప్లాంట్ డైరెక్టర్ పర్సనల్ ఎస్‌సి పాండే కార్యాలయంలో నేలపై పడుకున్న ఉక్కు కార్మిక నాయకులు

**ఉక్కు టౌన్‌షిప్, ఫిబ్రవరి 27:** స్టీల్‌ప్లాంటులో బయోమెట్రిక్ అమలుపై వివాదం తలెత్తింది. తమ సమస్యలు పరిష్కరించిన తరువాతే బయోమెట్రిక్ అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు మంగళవారం డైరెక్టర్ (పర్సనల్) ఛాంబర్‌లో ఆందోళనకు దిగారు. ప్లాంటులో బయోమెట్రిక్ ఏర్పాటుపై యాజమాన్యం ఈ నెల 24న కార్మిక సంఘ నాయకులతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా నాయకులు బయోమెట్రిక్‌కు తాము వ్యతిరేకం కాదని, అయితే కార్మికుల వేతన సవరణ, క్యాంటీన్, భద్రత పరిస్థితులు మెరుగు వంటి సమస్యలను పరిష్కరించాక అమలు చేయాలని డిమాండ్ చేశారు. అయితే నాయకుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా యాజమాన్యం మార్చి ఎనిమిది నుంచి బయోమెట్రిక్ అమలు చేస్తున్నట్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో కార్మిక నాయకులు మంగళవారం సాయంత్రం అడ్మిన్ బిల్డింగ్‌లోని డైరెక్టర్ ఛాంబర్‌కు వెళ్లి బయోమెట్రిక్ అమలు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో అక్కడే బైఠాయించారు. ఈ విషయం తెలిసిన కార్మికులు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. అయితే అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని గేటు వద్దే అడ్డుకున్నారు. దీంతో కార్మికులు అడ్మిన్ గేటు వద్ద బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. గేటు బయట, డైరెక్టర్ ఛాంబర్ వద్ద నాయకులు, కార్మికులు నిరసన కొనసాగిస్తున్నారు. 42 ఏళ్ల ఉక్కు చరిత్రలో రాత్రి సమయంలో ఉద్యోగులు/కార్మికులు ధర్నాకు దిగడం ఇదే మొదటిసారి. డైరెక్టర్ (పర్సనల్) కార్యాలయం వద్ద ఆందోళన తెలియజేస్తున్న కార్మిక నాయకులకు మద్దతుగా ఉద్యోగులు (రాత్రి 'సి' షిఫ్టునకు వెళ్లేవారు) మెరుపు ధర్నాకు దిగారు. అదేవిధంగా 'బీ' షిఫ్టునకు వెళ్లిన ఉద్యోగులు రాత్రి 10.30 గంటలకు బయటకు వచ్చి ధర్నాలో పాల్గొన్నారు. యాజమాన్యం స్పందించకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కొనవలసి ఉంటుందని హెచ్చరించారు. రాత్రి 12 గంటలకు కూడా ధర్నా కొనసాగుతూనే ఉంది. ఉక్కు సీఎండీ బయటకు ఒకటి చెప్పి, మరొకటి అమలు చేస్తున్నారని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, జి.గణపతిరెడ్డి, బీఎంకే నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు తప్పిన హాల్‌టికెట్ సమస్యలు

» వెబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం

**విశాఖపట్నం, ఫిబ్రవరి 27:** ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లాలోని 93 కేంద్రాల్లో 82,679 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం 40,873, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 41,806 మంది హాజరవుతున్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించలేదని, హాజరు చాలలేదని ఎవరూ భయపడనవసరం లేదు. పరీక్షలకు ఫీజులు చెల్లించిన ప్రతి విద్యార్థి ఈ ఏడాది పరీక్షలు రాసే అవకాశాన్ని బోర్డు కల్పించింది. ఇంటర్ వెబ్‌సైట్‌లో విద్యార్థుల హాల్‌టికెట్లు అప్‌లోడ్ చేసింది. కళాశాలల నుంచే కాకుండా వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించింది. హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ లేదా మరెవరి సంతకం అవసరం లేకుండా పరీక్షలు రాసేందుకు అవకాశం ఇచ్చింది. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో ప్రథమ సంవత్సరం విద్యార్థులైతే పదో తరగతి హాల్‌టికెట్ నంబర్, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫస్ట్ ఇయర్ హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ, నెల, సంవత్సరం నమోదు చేసి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**ఫీజులు, హాజరు సమస్యలు లేవు**

ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాయడానికి కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజులు, హాజరు సమస్యలను తొలగించారు. విద్యార్థులు హాల్‌టికెట్లు పొందడానికి హాజరు శాతం మినహాయించింది. గతంలో సైన్స్ విద్యార్థులకు 75 శాతం, ఆర్ట్స్ విద్యార్థులకు 60శాతం హాజరు ఉంటేనే పరీక్షలకు అనుమతి ఇచ్చేవారు. దీంతో జిల్లాలో ఏటా సుమారు 800 మంది పరీక్షలకు దూరమయ్యేవారు. కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలు తక్కువ హాజరు ఉన్న విద్యార్థుల నుంచి అదనంగా నగదు వసూలు చేసి హాల్‌టికెట్లు ఇచ్చేవారు. ఫీజు బకాయిలు చెల్లించకపోయినా హాల్‌టికెట్లను నిలిపివేసేవారు. ఈ ఏడాది అలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులందరూ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు రాసేలా బోర్డు ఆదేశాలు జారీచేసిందని ఆర్‌ఐవో పి.మురళీధర్ వివరించారు.

## నేటి నుంచి చెరకు రైతులకు పేమెంట్లు

» ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు

**చోడవరం, ఫిబ్రవరి 27:** గోవాడ షుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతులకు ప్రస్తుత సీజన్‌కు సంబంధించిన పేమెంట్లు ఈ నెల 28 నుంచి చెల్లించనున్నట్టు ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసి అండగా నిలిచిన రైతులను ఆదుకుంటామన్నారు. డిసెంబరు 29 నుంచి జనవరి 15 వరకు ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన 4,936 మంది రైతులకు తొలి విడతగా రూ.8.72 కోట్లు వారి ఖాతాలకు జమ చేస్తామని తెలిపారు. మిగిలిన రైతులకు కూడా త్వరలోనే పేమెంట్లు జమ చేస్తామన్నారు. ఈ ఏడాది సీజన్‌లో సోమవారం నాటికి లక్షా 38 వేల వంద టన్నుల చెరకు క్రషింగ్ నిర్వహించి లక్షా 13 వేల క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి చేశామని పేర్కొన్నారు. రోజువారీ రికవరీ 10.01 శాతం రాగా, సగటు రికవరీ 9.04 శాతం వచ్చిందని తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ 12 లక్షల 16 వేల ఆరు వందల యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసి ఈపీడీసీఎల్‌కు విక్రయించినట్టు తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది కటింగ్ పర్మిట్లు రైతులకు నేరుగా వారి ఫోన్లకే మెసేజ్ పంపించడంతో పాటు, సకాలంలో చెరకు పర్మిట్లు వారికి అందేలా చూశామన్నారు. ఈ సీజన్‌లో సహకరించిన రైతులకు, కార్మికులకు ఎండీ సన్యాసినాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

## కలెక్టరేట్ ఎదుట 'ఉపాధి' సిబ్బంది ఆందోళన

» సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె బాట పడతామని హెచ్చరిక


డీఆర్‌వోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 27:** తమ సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల జేఏసీ ప్రతినిధి జి.రవిచంద్ర మాట్లాడుతూ.. 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమకు గ్రేడ్‌లు, కేడర్ ఫిక్స్ చేయకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పీఆర్సీ అమలు చేయాలని, ఎఫ్‌టీఈ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట పడతామని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓ దయానిధిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి కొండాజీ, శివానీ, దేవకి, సతీశ్‌కుమార్, శ్రీను, దశరథ్ రామరాజేశ్ పాల్గొన్నారు.

## 33 ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయిక


సీతపాలెం తీరంలో కలుసుకున్న అచ్యుతాపురం హైస్కూల్ 1990-91 టెన్త్ బ్యాచ్

**అచ్యుతాపురం, ఫిబ్రవరి 27:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదవ తరగతి చదువుకున్న వారిలో పలువురు మంగళవారం రాంబిల్లి మండలం సీతపాలెం బీచ్‌లో ఆత్మీయంగా కలిశారు. వీరిలో ఒకరైన పూడిమడక మాజీ సర్పంచ్ మేరుగు బాపునాయుడు అందరిని సమన్వయపరిచి, 33 ఏళ్ల తరువాత ఒకచోట కలిసేలా కృషి చేశారు. ఎవరెక్కడ వుంటున్నారు, ఏం చేస్తున్నారో తెలుసుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. హైస్కూల్‌లో చదివిన రోజులను గుర్తు చేసుకున్నారు. ఏటా ఒకసారి తప్పనిసరిగా కలుసుకోవాలని తీర్మానించుకున్నారు.

## కేజీబీవీలో జీసీడీవో రాత్రి బస


సోమవారం రాత్రి స్టడీ అవర్‌లో విద్యార్థినులతో జీసీడీవో పద్మావతి

**కోటవురట్ల, ఫిబ్రవరి 27:** జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి (జీసీడీవో) పద్మావతి సోమవారం రాత్రి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సందర్శించారు. విద్యార్థినుల కోసం వండిన భోజన పదార్థాలను రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో సరుకులు, రికార్డులను తనిఖీ చేశారు. తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులతో మాట్లాడి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చారు. పరీక్షల సమయంలో ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా వుండాలని సూచించారు. సోమవారం రాత్రి విద్యాలయం ప్రత్యేక అధికారిణి సరితాదేవి, విద్యార్థినులతో కలిసి వసతిగృహంలో బసచేశారు. మంగళవారం ఉదయం యోగా తరగతులను పరిశీలించారు. స్టడీ అవర్‌లో పదో తరగతి పాఠ్యాంశాలకు సంబంధించి బాలికల సందేహాలను నివృత్తి చేశారు.

## నేడు రైతు భరోసా, పీఎం కిసాన్ సాయం విడుదల

**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 27:** రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ఐదో సంవత్సరం మూడో విడత సాయం, పంట రుణాలపై సున్నా వడ్డీ రాయితీ సొమ్మును ప్రభుత్వం బుధవారం విడుదల చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం జిల్లాలో అర్హులైన 2,65,886 మంది రైతులకు రూ.53.32 కోట్లు, సున్నావడ్డీ రాయితీ కింద రూ.6.9 కోట్లు ఆయా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని పేర్కొన్నారు.

## భువనేశ్వరికి స్వాగతం పలికిన రత్నాకర్



భువనేశ్వరితో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

**అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27:** తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరిని మంగళవారం విశాఖ విమానాశ్రయంలో తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ కలిసి స్వాగతం పలికారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా సాలూరు పర్యటనకు వెళ్లేందుకు వచ్చిన ఆమెకు రత్నాకర్ స్వాగతం పలికారు.

## రాజకీయ పక్షాల నేతలతో ఈఆర్వో సమావేశం

**ఎలమంచిలి, ఫిబ్రవరి 27:** రానున్న ఎన్నికలకు సంబంధించి మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నేతలతో ఈఆర్వో కె.మనోరమ సమావేశమయ్యారు. మండలంతోపాటు మునిసిపాలిటీలోనూ ఓటరు జాబితాల్లో ఓటర్ల నమోదు క్రమపద్ధతిలో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని టీడీపీ, జనసేన పార్టీల నేతలు బొద్దపు శ్రీను, నాయుడు, ఆడారి రమణబాబు, చిన్నారావులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. రెండు వార్డుల్లో ఓట్లు నమోదయ్యాయని, వీటిని సరిదిద్దాలని కోరగా.. ఫారమ్-7 అందజేయాలని సూచించారు. అనంతరం పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, మునిసిపల్ వైస్ ఛైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, వైసీపీ, టీడీపీ, జనసేన, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ పాటించాలి : డీఎస్పీ

**ఎలమంచిలి, ఫిబ్రవరి 27:** విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీఎస్పీ కేవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లను సమాచారం కోసం, విద్యకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంచుకునేందుకు మాత్రమే ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో సీఐ గఫూర్, ఎస్‌ఐ పాపినాయుడు, ఎంఈఓ మీనాక్షి, ఇన్‌చార్జి హెచ్‌ఎం, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విసు, వనుం నాగేశ్వరావు, పీఈటీ మూర్తి పాల్గొన్నారు.

## అణుకును సందర్శించిన అధికార యంత్రాంగం



గ్రావెల్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

**కోటవురట్ల, ఫిబ్రవరి 27:** మండలంలోని గొట్టివాడ శివారు అణుకు గ్రామంలో జరుగుతున్న మెటల్‌రోడ్డు నిర్మాణ పనులను మండల యంత్రాంగం మంగళవారం పరిశీలించింది. ఈ గ్రామానికి రహదారి, పాఠశాల, మౌలిక వసతులు కల్పించాలంటూ సీపీఎం 48 రోజులు ఆందోళన చేసిన విషయం విదితమే. దీంతో కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి రోడ్డు నిర్మాణానికి రూ.32 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు నెల రోజుల నుంచి జరుగుతున్నాయి. మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, మండల ఇంజనీర్ వర్మ, సర్పంచ్ రమేష్ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు.

## సందడిగా పరదేశిమాంబ పండుగ

**తుమ్మపాల, ఫిబ్రవరి 27:** మండలంలోని మార్టూరులో మంగళవారం పరదేశిమాంబ అమ్మవారి పండుగ ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయాన్ని, గ్రామ పురవీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామ నాయకులు కరణం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు.

## పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన రూరల్ సీఐ

**తుమ్మపాల, ఫిబ్రవరి 27:** ఎన్నికలు సమీపిస్తుండడంతో అనకాపల్లి మండలంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం రూరల్ సీఐ ధనుంజయరావు సిబ్బందితో కలిసి పరిశీలించారు. మామిడిపాలెం, మాకవరం, మార్టూరు పాఠశాలలు, పరిసరాలను ఆయన పరిశీలించారు. వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఐ ధనుంజయరావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ప్రతి గ్రామంపై నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెదకలవలాపల్లి రైతు శిబిరాన్ని సందర్శించిన ఆర్డీఓ

**రాంబిల్లి, ఫిబ్రవరి 27:** మండలంలోని పెదకలవలాపల్లిలో రక్షణ శాఖ అధికారులు పొలాలకు వెళ్లే దారులను మూసివేసి ప్రహరీగోడను నిర్మించడాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళన చేస్తున్న శిబిరాన్ని మంగళవారం అనకాపల్లి ఆర్డీఓ చిన్నికృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యామ్నాయం చూపించకుండా గోడను ఏర్పాటు చేస్తే ఎలా అని రైతులు ఆర్డీఓను ప్రశ్నించారు. అనంతరం ఆయన చినకలవలాపల్లి వెళ్లి రైతులతో మాట్లాడారు. ప్రహరీ గోడను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామానికి జరిగే నష్టాన్ని సర్పంచ్ శ్రీనివాసరావు, రైతులు ఆర్డీఓ చిన్నికృష్ణకు వివరించారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఆర్డీఓ చిన్నకృష్ణ హామీ ఇచ్చారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**సబ్బవరం, ఫిబ్రవరి 27 :** సబ్బవరం మేజరు పంచాయతీ పరిధిలోని పాతపోస్టాఫీస్ వీధిలో శ్మశానానికి వెళ్లే మార్గంలో రూ.3.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మండల లక్ష్మణ, వార్డు మెంబర్లు కొల్లి దేముడమ్మ, కృష్ణ, టి.శేఖర్, చిత్రాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బండరాళ్లు లోడు లారీ బోల్తా

**రాంబిల్లి, ఫిబ్రవరి 27:** మండలంలోని నేవీ రోడ్డులో రాజుకోడూరు జంక్షన్ సమీపంలో మంగళవారం బండరాళ్ల లోడుతో వెళుతున్న లారీ లోతట్టు ప్రాంతంలో ఉన్న తోటలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ విషయమై రాంబిల్లి సీఐ లక్ష్మణరావును వివరణ కోరగా.. ఈ విషయమై ఫిర్యాదు అందలేదన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

## 'సంపతిపురం లేఅవుట్‌లపై విచారణ జరపాలి'

**కొత్తూరు, ఫిబ్రవరి 27 :** అనకాపల్లి మండలం సంపతిపురంలో ఆక్రమణకు గురైన లేఅవుట్‌పై విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ నాయకులు లేఅవుట్‌లో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అమ్మకాలు జరుపుతున్న అధికార పార్టీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాల్లో గ్రావెల్ అమ్ముకొని లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు చేపట్టకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వియ్యపు రాజు, నరాలశెట్టి సత్యనారాయణ, మత్తుర్తి సూరిబాబు, భరణికాన సాయి, ఒమ్మి సతీష్ పాల్గొన్నారు.

## పల్స్‌పోలియోని విజయవంతం చేయాలి

**రాంబిల్లి, ఫిబ్రవరి 27 :** మార్చి 3న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సిబ్బంది విజయవంతం చేయాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.వెంకటేష్ అన్నారు. దిమిలి ఆరోగ్యకేంద్రం పరిధిలో 1,419 మంది పిల్లలు ఉన్నారని, వారందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ బాలాశ్రావణి, ఎస్‌ఎస్‌వీఎస్‌రాజు, సీహెచ్ ధనరాజు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

**నక్కపల్లి, ఫిబ్రవరి 27:** సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఏ క్షణాన్నైనా రావచ్చుననే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ఎన్నికల కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలకు సంబంధించి నివేదికలను కలెక్టర్‌కు సమర్పించారు. నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఎన్నికల అనంతరం ఈవీఎంలను పైన రేకుల షెడ్డు వున్న గదుల్లో కంటే జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయడం చాలా మంచిదని కలెక్టర్, ఎస్పీలు అభిప్రాయపడ్డారు. జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లుగా ఎంపిక చేసిన గదుల్లో సున్నం వేసి, లైటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఈఆర్వో గీతాంజలిని ఆదేశించారు. వారి వెంట అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, సీఐలు విజయ్ కుమార్, అప్పన్న, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామ రాజు, ఎంఈవో కె.నరేశ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ వున్నారు.



నక్కపల్లి జూనియర్‌కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీలు



ఎలమంచిలి డిగ్రీ కళాశాలలో డిస్ట్రిబూషన్ ప్రాంతాన్ని పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టరు, ఎస్పీ

**ఎలమంచిలిలో..**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను మంగళవారం జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు. అలాగే డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ ప్రాంతాన్ని వారు పరిశీలించారు. అదేవిధంగా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టరు పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లకు ఉన్న కిటికీల డోర్స్ ఉడ్‌తో చేసినవి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వో కె. మనోరమ, పలు శాఖల అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# 'గూటూరు' సస్పెన్షన్ ఎత్తివేయాలని వైసీపీ దళిత నేతల ఆందోళన

**పాయకరావుపేట, ఫిబ్రవరి 27 :** పేదల పక్షాన నిలబడిన వైసీపీ నాయకుడు గూటూరు శ్రీనివాసరావు సస్పెన్షన్‌ను పార్టీ అధిష్ఠానం వెంటనే ఎత్తివేయాలని ఆ పార్టీకి చెందిన పలువురు దళిత నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వైసీపీ నుంచి సస్పెండైన గూటూరు శ్రీనివాసరావుకు సంఘీభావంగా పలువురు వైసీపీ నాయకులు, పార్టీ దళిత నాయకులు పాయకరావుపేటలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక పాండురంగస్వామి ఆలయం నుంచి పట్టణంలో గూటూరు శ్రీనివాసరావు ఇంటి వరకు ప్లకార్డుల ప్రదర్శనతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు నెలపర్తి అర్జున్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో స్థానికులకే పార్టీ టిక్కెట్ కేటాయించాలని అడిగినందుకు పార్టీ అధిష్ఠానం ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం దారుణమన్నారు. స్థానికులకే టిక్కెట్ కేటాయించాలంటూ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా డిమాండ్ చేసినా వారందరినీ విడిచిపెట్టి 'గూటూరు'ను మాత్రమే పార్టీ సస్పెండ్ చేయడం విచారకరమన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం స్పందించి గూటూరు శ్రీనివాసరావు సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు షైలపల్లి అశోక్, కె.సత్తిబాబు, తాటిపాక లోవరాజు, తోట జమీలు, అనిశెట్టి సూరి, ముప్పిన శ్రీను, పల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో ఆందోళన చేస్తున్న వైసీపీ శ్రేణులు

### వైసీపీ నాయకుడు 'గూటూరు' సస్పెన్షన్

**పాయకరావుపేట, ఫిబ్రవరి 27 :** పాయకరావుపేటకు చెందిన వైసీపీ నాయకుడు, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ గూటూరు శ్రీనివాసరావును పార్టీ అధిష్ఠానం సస్పెండ్ చేసినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన కంబాల జోగులకు వ్యతిరేకంగా ర్యాలీలు, కార్యక్రమాలు చేపట్టిన సందర్భంగా గూటూరు శ్రీనివాసరావుతోపాటు ఎస్.రాయవరం మండలానికి చెందిన పోలిశెట్టి పెద్దఈశ్వరరావును కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు తెలిపాయి.

# వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడండి : ఎంపీపీ

**కశింకోట, ఫిబ్రవరి 27 :** వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ కలగా లక్ష్మి అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో తాగునీటి సమస్యపై ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెచ్చారు. జలజీవన మిషన్ పథకం పనులు జరుగుతున్నాయని, వాటన్నింటినీ త్వరలోనే పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పావని తెలిపారు. మండలంలోని 12 జగనన్న లేఅవుట్‌లు ఉన్నాయని, వాటిలో పనులు పూర్తి చేసేందుకు గ్రామ జల సంఘాలను ఏర్పాటు చేశామని చెప్పారు. జలవనరుల శాఖ ఏఈ హనుమంతరావు మాట్లాడుతూ.. మండలంలోని 4 గ్రోయిన్లు మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు.ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే గ్రోయిన్ల పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఏంఈవో-2 చిట్టిబాబు మాట్లాడుతూ మండలంలోని 13 స్కూళ్ల నుంచి 901 మంది 10వ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని, వారందరి ఇళ్లకు రాత్రి వేళల్లో ఇళ్లకు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఆర్‌ఐ శ్రావణి మాట్లాడుతూ ప్రస్తుతం బయ్యవరం, తీడ గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో కొంత మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉందని సర్పంచులు అడుగగా వాటిని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగ లక్ష్మి

**సంతకాలు చేసి వెళ్లిపోయిన సర్పంచులు**

మండలంలోని 27 పంచాయతీల సర్పంచులకుగానూ 10 మంది సూపర్ సర్పంచులు హాజరయ్యారు. 19 మంది ఎంపీటీసీ సభ్యులుండగా వారిలో 10 మంది హాజరయ్యారు. అయితే వీరంతా సభ ప్రారంభానికి ముందు మినిట్స్ పుస్తకంలో సంతకాలు చేసి జారుకున్నారు. దీంతో సమావేశ మందిరమంతా ఒక పక్క ఖాళీ కుర్చీలు, మరో పక్క అధికారులతోనూ దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, మండల వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, ఎంపీడీవో శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రామచంద్రమ్మ అమ్మవారి పండుగ

**పరవాడ, ఫిబ్రవరి 27 :** వాడచీపురుపల్లి రామచంద్రమ్మ అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున మూడు గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమయ్యాయి. పరిసర గ్రామాల ప్రజలతోపాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ శివలంక లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గెడ్డం పుష్ప, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ బురద అప్పలరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకువెళ్లి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు. పండగ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. సాయంత్రం ఆరు గంటల నుంచి భారీ బాణసంచా కాల్చారు. పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ అందరినీ ఆకట్టుకుంది. ప్రధాన కూడళ్లల్లో ఎల్‌ఈడీ లైట్లతో ఏర్పాటు చేసిన కటౌట్లు అందరినీ ఆకర్షించాయి. అమ్మవారి ప్రతిరూపంలో ఏర్పాటు చేసిన కటౌట్లు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



పూజలు చేసేందుకు బారులు తీరిన భక్తులు. ఇన్‌సెట్‌లో అమ్మవారు



కొణతాలకు మెమోంటోతో సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

## ఘనంగా పంచగ్రామాల నల్లమారమ్మ పండుగ

**కొత్తూరు, ఫిబ్రవరి 27 :** మండలంలోని పంచగ్రామాల నల్లమారమ్మ తల్లి పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. బీఆర్‌టీ కాలనీ, రామభద్రపురం, రామాపురం కాలనీల్లో అమ్మవార్లకు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జనసేన, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధులు వీరికి మెమోంటో ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేము సైతం సమాజం కోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. అధిక సంఖ్యలో యువకులు రక్తదానం చేశారు. ఈ రక్తాన్ని ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంక్‌కి ఇచ్చారు.

## అరాచక పాలనను అంతమొందించాలి

... 5వ పేజీ తరువాయి

బుద్ధ నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ, టీడీపీ అధినేత ఆదేశాల మేరకు అనకాపల్లి నుంచి కూటమి తరపున పోటీచేస్తున్న కొణతాల రామకృష్ణ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు డాక్టర్ నారాయణరావు, నాయకులు బి.శ్రీను, కోట్ని రామకృష్ణ, కె.రామునాయుడు, వెంకటరావు, జగన్మోహన్, మళ్ల గణేశ్, సత్యనారాయణ, విష్ణుచౌదరి, పీలా తారకేశు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కార్యాలయం ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహానికి కొణతాల రామకృష్ణ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# అడ్డగోలుగా చేపల చెరువులు

... 5వ పేజీ తరువాయి

జిల్లాల నుంచి వచ్చిన పలువురు చేపల పెంపకందారులు దేవరాపల్లి మండలంలోని కొత్తపెంట, ఎం.అలమండ, తారువ, తామరబ్బ, చేనులపాలెం, ఎస్.గజపతినగరం, మారేపల్లి, కలిగొట్ల, ములకలాపల్లి, పెదనందిపల్లి, బి.కింతాడ, తదితర గ్రామాల్లోని వ్యవసాయ భూములను గోదావరి జిల్లాలకు చెందిన కొంతమంది చేపల పెంపకందారులు లీజుకు తీసుకున్నారు. ఏటా ఎకరాకు రూ.50 వేల చొప్పున కౌలు చెల్లిస్తుంటారు. చేపల పెంపకందారులు రైవాడ కాలువల నుంచి నీటిని చెరువులకు మళ్లిస్తున్నారు. చేపలు పట్టిన తరువాత వ్యర్థ జలాలను వాగులు, గెడ్డల్లోకి విడిచిపెడుతున్నారు. చేపల చెరువుల వల్ల తమ పంట పొలాలు పాడైపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**చేపల ఆహారంగా చికెన్ వ్యర్థాలు**

చేపలు త్వరగా పెరగడానికి, మేత ఖర్చు తగ్గించుకోవడానికి చెరువుల నిర్వాహకులు బ్రాయిలర్ కోళ్ల (చికెన్) వ్యర్థాలను ఆహారంగా వేస్తున్నారు. విశాఖ, అనకాపల్లి, చోడవరం, కొత్తవలస, తదితర ప్రాంతాల్లోని చికెన్ షాపుల నుంచి వ్యర్థాలను కొనుగోలు చేస్తున్నారు. ఇంకా వారపు సంతల్లో చౌకగా లభించే పశు మాంసం కూడా తీసుకువస్తున్నారు. రాత్రి వేళల్లో వీటిని ఉడబెట్టి చేపలకు ఆహారంగా వేస్తున్నారు. అనుమతులు లేకుండా పంట పొలాలను చేపల చెరువులుగా మార్చడం, హానికరమైన వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేయడం, పంట కాలువల నుంచి చేపల చెరువులకు అక్రమంగా నీటిని మళ్లించడం, చేపలు పట్టిన అనంతరం వ్యర్థ జలాలను వాగులు, గెడ్డల్లోకి విడుదల చేయడంపై సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర ఆవేదన వ్యక్తం చేశారు.

## 'బీసీలకు ఉద్యోగ, రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పించాలి'

**అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27 :** బీసీలకు ఉద్యోగాల్లో, రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొణతాల చంద్రశేఖర్ కోరారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంఘ సమావేశం మంగళవారం సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తూర్పు కాపులుగా తప్పుడు ధ్రువపత్రాలతో బీసీ సర్టిఫికెట్లను పొందడం వల్ల నిజమైన బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు బుద్ద భూలోకనాయుడు, కార్యదర్శి బోలెం కుసరాజు, పిట్ల రాజు, కె.సూర్యనారాయణశాస్త్రి, పెంటకోట వెంకట శివఅప్పారావు, మళ్ల జగన్మోహనరావు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

**అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27:** స్థానిక గాంధీనగరంలోని సరస్వతి విద్యాలయంలో మంగళవారం విద్యార్థులకు ట్రాఫిక్ భద్రత, ప్రమాణాల పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ట్రాఫిక్ ఎస్‌ఐ సోమశేఖరరావు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సదస్సులో ఎస్‌జీవో నాగేశ్వరరావు,స్కూల్ కరస్పాండెంట్ ఎం.రంగాదేవి, డైరెక్టర్ బంగార్రాజు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27:** పట్టణంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 30వ ఆరాధన, మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని పట్టణ కార్పెంటర్ సంఘం గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మథరావు మంగళవారం ఆవిష్కరించారు. సంఘ ఆధ్వర్యంలో మార్చి ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు వైభవంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి ఎం.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షలకు సిద్ధం కావాలి : డీఈవో

**పరవాడ, ఫిబ్రవరి 27:** వచ్చే నెలలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ సూచించారు. మంగళవారం ఆమె దేశపాత్రునిపాలెం హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు ఎలా సన్నద్ధం అవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. శతశాతం ఉత్తీర్ణత కావాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం పనితీరును పరిశీలించారు.

## అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకోవాలి

**పరవాడ, ఫిబ్రవరి 27:** అర్హులంతా తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పరవాడ సీఐ బాలసూర్యారావు సూచించారు. మంగళవారం ఆయన కన్నూరులో పర్యటించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి కొట్లాటకు, తగాదాలు పడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్న పత్రాలు

**అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27:** మార్చి ఒకటో తేదీ నుంచి పట్టణంలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు మంగళవారం అనకాపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు పట్టణంలోని వివిధ విద్యాసంస్థల్లో పరీక్షలు జరగనున్నాయి. పరీక్షా పత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచామని పట్టణ సీఐ జి. శంకరరావు తెలిపారు.

## టీటీడీ నిధులు మంజూరు చేయండి

**▸▸వైవీ సుబ్బారెడ్డికి నూకాంబిక ఆలయ పాలకవర్గం వినతి**

**అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27:** నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం కోసం టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో మంజూరు చేసిన రూ.కోటి 50 లక్షలు విడుదలకు సహకరించాలని టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి కోరినట్టు ఆలయ ఛైర్మన్ కొణతాల మురళీకృష్ణ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నిధులు విడుదలయ్యేలా ప్రస్తుత పాలకవర్గం, అధికారులకు తగిన సూచనలు చేయాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో వైవీ సుబ్బారెడ్డిని కోరినట్టు ఆయన తెలిపారు. త్వరలోనే నిధులు విడుదలయ్యేలా కృషి చేస్తానని సుబ్బారెడ్డి హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

## పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్ చేయించుకున్న పేదలు

**అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 27 :** స్థానిక ఏఎంఏఎల్ రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఎనిమిది మంది పేదలకు ఐఓఎల్ కంటి ఆపరేషన్లు నిర్వహించారు. సోమవారం ఆస్పత్రికి 29 మంది కంటి రోగులు హాజరుకాగా వారికి నేత్ర వైద్య సహాయకులు పి.దేవి పరీక్షలు నిర్వహించారు. వారిలో ఎనిమిది మందికి కంటి ఆపరేషన్లు పడతాయని నిర్ధారించడంతో మంగళవారం డాక్టర్ కె.మల్లేశ్వరరావు ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్లు చేయించుకున్న వారికి మందులను ఉచితంగా ఇచ్చామని ఆస్పత్రి ఛైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు.

## కార్యకర్తల మనోభావాలను గుర్తించాలి



మాట్లాడుతున్న కర్రి బాబి

**తుమ్మపాల, ఫిబ్రవరి 27 :** టీడీపీ కార్యకర్తల మనోభావాలను పార్టీ అధిష్ఠానం గుర్తించాలని, అనకాపల్లి ఎమ్మెల్యే సీటును పీలా గోవింద సత్యనారాయణకు కేటాయించాలని పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద సమావేశమైన నేతలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రధానంగా అనకాపల్లి మండల నాయకులు కర్రి బాబి, కొణతాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పదేళ్లుగా పార్టీకి పీలా గోవింద సేవలందించాలన్నారు. పీలాకు సీటు ఇస్తారన్న నమ్మకంతో కార్యకర్తలంతా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తూ ముందుకు సాగుతున్న తరుణంలో సీటు కేటాయించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## 'శ్రీరాంపురంలో పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి'

**పాయకరావుపేట, ఫిబ్రవరి 27 :** మండలంలోని శ్రీరాంపురంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా గుర్తించిన సర్వే నంబరు 17/1లో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆయన వార్డు సభ్యులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాల పంపిణీలో జాప్యం చేయడం విచారకరమన్నారు. పైగా ఈ భూమిలో ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డును తొలగించిన వ్యక్తులను అధికారులు గుర్తించి చర్యలు తీసుకోలేదన్నారు. ఆక్రమణదారులకు ఇప్పటివరకు నోటీసులు కూడా ఇవ్వలేదన్నారు. ఈ స్థలాన్ని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని పంచాయతీ తీర్మానం చేసి అధికారులకు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు జి.వెంకన్న, పి.మల్లిబాబు, బి.కృష్ణ, ఎం.నరసింహమూర్తి, సీపీఎం నాయకుడు బి.నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు సీహెచ్.గోవిందరాజు పాల్గొన్నారు.

## 'టెన్త్ విద్యార్థులను సమాయత్తం చేయాలి'



రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

**నక్కపల్లి, ఫిబ్రవరి 27:** మరికొద్ది రోజుల్లో టెన్త్ పరీక్షలు ప్రారంభంకానున్నాయని, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా ఉపాధ్యాయులు సిద్ధం చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక గర్ల్స్ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. టెన్త్‌లో పలు సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈవో నరేశ్, నోడల్ హెచ్‌ఎంలు వేమగిరి నూకరాజు, కోడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలు ప్రారంభం

**ఎలమంచిలి, ఫిబ్రవరి 27:** ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్. బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈనెల 26 వ తేదీన ప్రారంభమైన ఈ పరీక్షలు మార్చి 2 వ తేదీ వరకూ జరుగుతాయి. మంగళవారం పరీక్షలకు 208 మంది పరీక్షలకు హాజరైనట్టు సెంటరు నిర్వాహకులు తెలిపారు.

## రెండో రోజు ఎల్‌అండ్‌టీ కార్మికుల ఆందోళన

**రాంబిల్లి, ఫిబ్రవరి 27 :** ఎల్‌అండ్‌టీ యాజమాన్యం ముందు ఉంచిన 8 డిమాండ్లను పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు మంగళవారం రెండో రోజూ ఆందోళన చేశారు. విశాఖపట్నంలో లేబర్ కమిషనర్‌తో ఎల్‌అండ్‌టీ యాజమాన్యం, సీఐటీయూ లక్ష్మణరావు, దీనబంధు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు చర్చలు జరిపారు. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే కార్మికుల సమస్యలు చర్చించుకోవడానికి అవకాశం ఉందని లేబర్ కమిషనర్ చెప్పారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దేముడునాయుడు తెలిపారు. లేబర్ కమిషనర్ తెలిపిన విషయాలను యూనియన్ ప్రతినిధులు కార్మికులందరికి తెలియజేసి, విధులకు హాజరయ్యే విధంగా చూస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

## సచివాలయాల ఎనర్జీ అసిస్టెంట్ల కార్యవర్గం

**తుమ్మపాల, ఫిబ్రవరి 27:** రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాల ఎనర్జీ అసిస్టెంట్ల జిల్లా కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. గౌరవ అధ్యక్షునిగా రాజాన దొరబాబు, అధ్యక్షునిగా కె.రమేష్, కార్యనిర్వాహణ అధ్యక్షునిగా జి.శ్రీను, ప్రధాన కార్యదర్శిగా జి. సన్యాసినాయుడు, కోశాధికారిగా వై. గణేష్ ఎన్నికయ్యారు. మరో 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పీవీ మంజునాథ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం నియోజకవర్గం

### విద్యార్థులు వృత్తివిద్యా కోర్సులపై అవగాహన చేసుకోవాలి




వృత్తి విద్యా కోర్సులపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

**గొలుగొండ, ఫిబ్రవరి 27:** మండలంలోని బీఆర్. అంబేడ్కర్ గురుకుల కళాశాలలో మంగళవారం వృత్తి విద్యా కోర్సులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు, వృత్తి విద్యాకోర్సులపై అవగాహన చేసుకోవాలన్నారు. కంప్యూటర్ విద్యను విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. అప్పుడే అన్నిరంగాల్లోనూ రాణించగలరన్నారు. అనంతరం నర్సీపట్నంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌కు 9వ తరగతి విద్యార్థులను తరలించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కేవీ. రమణ, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి ప్రజావేదిక రేపు

**మాకవరపాలెం, ఫిబ్రవరి 27:** ఈనెల 29వ తేదీన ఉపాధి పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు ఏపీవో వరలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది మండలంలో జరిగిన ఉపాధి పనులపై 15 రోజులుగా గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 29వ తేదీన మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉపాధి కూలీలు, ఉపాధి సిబ్బంది హాజరుకావాలని కోరారు.

### నేడు, రేపు రోజువారీ, వారపు సంతలకు వేలం పాటలు

**నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 27 :** మండల పరిషత్ ఆధీనంలో నిర్వహిస్తున్న వేములపూడి, నర్సీపట్నం ఇందిరా మార్కెట్‌ల రోజువారీ, వారపు సంత వేలంపాటను ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. 2024-2025 ఏడాదికి ఆశీలు వసూళ్లు చేసుకునే హక్కును కల్పించేందుకు ఈనెల 28 నర్సీపట్నం ఇందిరా మార్కెట్‌కు, 29న వేములపూడి సంతకు వేలం పాటలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 9849900015, 9052741584లలో సంప్రదించాలని కోరారు.

# గాంధీనగరంలో సమస్యలు కొలువు

» వెలగని వీధిదీపాలు.. » పారిశుధ్యం అధ్వానం.. » సక్రమంగా జరగని నీటి సరఫరా.. » తాగునీటికి ఇక్కట్లు



గ్రామంలో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం



కొళాయికు ట్యాపులు లేకుండా నిరుపయోగంగా ఉన్న దృశ్యం

**నాతవరం, ఫిబ్రవరి 27 :** మండలంలో గాంధీనగరం గ్రామస్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు.. పారిశుధ్యం పనులు చేపట్టడం లేదు.. సక్రమంగా నీటి సరఫరా కాకపోవడంతో తాగునీటికి గ్రామస్థులు ఇబ్బందిఇ పడుతున్నారు. ఎస్సీ కాలనీలో నాలుగు నెలల నుంచి వీధిదీపాలు వెలగడం లేదని, దీంతో రాత్రివేళలలో పాముల బెడద ఉందని కాలనీవాసులు చెబుతున్నారు. ఎస్సీ కాలనీలో రోజూ నీటి పథకం నుంచి నీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. అలాగే చాలాచోట్ల కొళాయిలకు ట్యాపులు లేవు. గాంధీనగరం పంచాయతీలో స్వీపర్లు లేకపోవడంతో గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని వారంటున్నారు. ఇక్కడ ఇద్దరు స్వీపర్లు ఒకప్పుడు పనిచేసేవారని, వారికి సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడంతో మానేశారని గ్రామస్థులు తెలిపారు. స్వీపర్లకు వేతనాలు ఇవ్వలేదన్న విషయాన్ని పంచాయతీ కార్యదర్శి కవితారాణిని వివరణ కోరగా 2023 మార్చి వరకు స్వీపర్లకు వేతనాలు ఇచ్చామన్నారు. తర్వాత స్వీపర్లకు వేతనాలను పంచాయతీ ఇవ్వవలసి రావడంతో నిధులు లేక ఒక స్వీపరును తొలగించామన్నారు. అలాగే ఆరు నెలల క్రితం ఉన్న ఒక్క స్వీపరును కూడా తీసేశామన్నారు గ్రామంలో పని అవసరమైనప్పుడు రోజు కూలీ ఇచ్చి పనులు చేయించుకుంటున్నామని తెలిపారు. గతంలో పనిచేసిన ఇద్దరు స్వీపర్లకు 2023 ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ఒక్కొక్కరి రూ.12వేలు వేతనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, వారికి త్వరలో ఇస్తామన్నారు.

#### తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం..



దండాడ అచ్చియ్యమ్మ, ఎస్సీ కాలనీవాసులు

ఎస్సీ కాలనీకి తాగునీరు సక్రమంగా సరఫరా చేయడం లేదు. దీంతో మహిళలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని రోజూ తాగునీరు సరఫరా చేసేలా చూడాలి.

# స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత

» పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

**నర్సీపట్నం, ఫిబ్రవరి 27 :** రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ ఆర్డీవోను ఆదేశించారు. మంగళవారం వారు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయం చేసుకొని పోలింగ్ సామగ్రి భద్రత, డిస్ట్రిబ్యూషన్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఎన్నికల విధులు నిర్వహించిన అనుభవజ్ఞులైన అధికారుల సూచనలు, సలహాలు తీసుకొని ఎటువంటి పొరపాటుకి తావులేకుండా చూడాలన్నారు. సీసీ కెమెరాలు అమర్చాలని, నిరంతరం విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్డీవో జయరాంకి సూచించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద అగ్నిమాపక పరికరాలు సిద్ధం చేయాలన్నారు. తర్వాత రూ.45 లక్షలతో చేపడుతున్న ఆర్‌అండ్‌బీ బంగ్లా మరమ్మతు పనులు జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎలక్షన్ అబ్జర్వర్‌కి ఇక్కడి ఏసీ సూట్ కేటాయించడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు హుటాహుటిన పనులు మొదలు పెట్టి గదిని సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి. విజయభాస్కర్, పట్టణ సీఐ కాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో కాయకల్ప బృందం

**నర్సీపట్నం, ఫిబ్రవరి 27 :** స్థానిక ఏరియా ఆస్పత్రి ఆస్పత్రిని కాయకల్ప ఫైనల్ ఎస్సెస్‌మెంట్ టీమ్ మంగళవారం సందర్శించింది. స్టేట్ కన్సల్టెంట్స్ డాక్టర్ శ్రీనివాసవర్మ, రూపేష్ పాల్ ఆశ ప్రాంతీయ ఆస్పత్రిలోని పరిసరాల పరిశుభ్రత, గ్రీనరీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఓపీ, శస్త్ర చికిత్స, ప్రసూతి, అత్యవసర విభాగాలు, జనరల్ వార్డులు, మెయిన్ స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. గత ఏడాది కాయకల్ప రాష్ట్ర స్థాయి అవార్డు కింద రూ.15 లక్షలు వచ్చింది. తాజాగా 2023-24 కాయకల్ప అవార్డు కోసం ప్రాంతీయ ఆస్పత్రి పోటీ పడుతుంది. ఇందు కోసం ఆస్పత్రిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఘనంగా అడవిరాజుబాబుల పండగ

**కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 27:** గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట, నాగాపురం, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట, కొండగోకిరి, కినపర్తి, భీమవరం తదితర గ్రామాల్లో అడవిరాజుబాబుల పండగను మంగళవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పొలాల్లోని అడవిరాజుబాబుల గుడిల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, ఏఎల్‌పురం-2 ఎంపీటీసీ సభ్యుడు రుత్తల రామకృష్ణ, పేరెంట్ కమిటీ చైర్మన్ గొర్లి లక్ష్మణరావుపాల్గొన్నారు.

### నేడు పట్టణంలో అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవం

**ఎలమంచిలి, ఫిబ్రవరి 27:** అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని బుధవారం పట్టణంలో జరుపుకునేందుకు ఏర్పాట్లు చేశామని ది టైలర్స్ ఇండస్ట్రియల్ కో-ఆపరేటివ్ సొసైటీ మండల అధ్యక్షుడు వియ్యపు సత్తిబాబు తెలిపారు. ఉదయం పట్టణంలో ర్యాలీ నిర్వహించడంతోపాటు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### అరాచక పాలనను అంతమొందించాలి

... 5వ పేజీ తరువాయి

బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ, టీడీపీ అధినేత ఆదేశాల మేరకు అనకాపల్లి నుంచి కూటమి తరపున పోటీచేస్తున్న కొణతాల రామకృష్ణ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు డాక్టర్ నారాయణరావు, నాయకులు బి.శ్రీను, కోట్ని రామకృష్ణ, కె.రామునాయుడు, వెంకటరావు, జగన్మోహన్, మళ్ల గణేశ్, సత్యనారాయణ, విష్ణుచౌదరి, పీలా తారకేశు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కార్యాలయం ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహానికి కొణతాల రామకృష్ణ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

### అడ్డగోలుగా చేపల చెరువులు

... 5వ పేజీ తరువాయి

జిల్లాల నుంచి వచ్చిన పలువురు చేపల పెంపకందారులు దేవరాపల్లి మండలంలోని కొత్తపెంట, ఎం.అలమండ, తారువ, తామరబ్బ, చేనులపాలెం, ఎన్.గజపతినగరం, మారేపల్లి, కలిగొట్ల, ములకలాపల్లి, పెదనందిపల్లి, బి.కింతాడ, తదితర గ్రామాల్లోని వ్యవసాయ భూములను గోదావరి జిల్లాలకు చెందిన కొంతమంది చేపల పెంపకందారులు లీజుకు తీసుకున్నారు. ఏటా ఎకరాకు రూ.50 వేల చొప్పున కౌలు చెల్లిస్తుంటారు. చేపల పెంపకందారులు రైవాడ కాలువల నుంచి నీటిని చెరువులకు మళ్లిస్తున్నారు. చేపలు పట్టిన తరువాత వ్యర్థ జలాలను వాగులు, గెడ్డల్లోకి విడిచి పెడుతున్నారు. చేపల చెరువుల వల్ల తమ పంట పొలాలు పాడైపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**చేపల ఆహారంగా చికెన్ వ్యర్థాలు**

చేపలు త్వరగా పెరగడానికి, మేత ఖర్చు తగ్గించుకోవడానికి చెరువుల నిర్వాహకులు బ్రాయిలర్ కోళ్ల (చికెన్) వ్యర్థాలను ఆహారంగా వేస్తున్నారు. విశాఖ, అనకాపల్లి, చోడవరం, కొత్తవలస, తదితర ప్రాంతాల్లోని చికెన్ షాపుల నుంచి వ్యర్థాలను కొనుగోలు చేస్తున్నారు. ఇంకా వారపు సంతల్లో చౌకగా లభించే పశు మాంసం కూడా తీసుకువస్తున్నారు. రాత్రి వేళల్లో వీటిని ఉడబెట్టి చేపలకు ఆహారంగా వేస్తున్నారు. అనుమతులు లేకుండా పంట పొలాలను చేపల చెరువులుగా మార్చడం, హానికరమైన వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేయడం, పంట కాలువల నుంచి చేపల చెరువులకు అక్రమంగా నీటిని మళ్లించడం, చేపలు పట్టిన అనంతరం వ్యర్థ జలాలను వాగులు, గెడ్డల్లోకి విడుదల చేయడంపై సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర ఆవేదన వ్యక్తం చేశారు.

## చోడవరం నియోజకవర్గం



పందెంలో హుషారుగా పరుగు పెడుతున్న ఎడ్లు

### వైభవంగా ఆంజనేయస్వామి తీర్థం

**బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 27:** మండల కేంద్రంలో ఆంజనేయస్వామి తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. బుచ్చెయ్యపేట, దిబ్బిడి, కందిపూడి, పోలేపల్లి, కొండెంపూడి, కేపీ.అగ్రహారం, కొండపాలెం, పెదమదీన తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పందెంలో 12 జతల ఎడ్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఎడ్ల పందెం పోటీలు ప్రజలను అలరించాయి. పోటీల్లో విజేతలతో పాటు ముగ్గుల పోటీలో విజేతలకు టీడీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు నగదు పురస్కారాలను అందించారు. నాయకులు మల్లునాయుడు, సుంకర లక్ష్మి, దొంకిన అప్పలనాయుడు, సుంకర గాంధీ, శనివాడ అప్పారావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

### రెండు గ్రామాల్లో అమ్మవార్ల పండగలు



మట్టవానిపాలెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

**రావికమతం, ఫిబ్రవరి 27:** మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం అమ్మవార్ల పండగలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మట్టవానిపాలెంలో పరదేశమ్మతల్లి, గొంప గ్రామంలో పైడితల్లమ్మతల్లి పండగలను చేశారు. మంగళవారం వేకువ జాము నుంచే అమ్మ వార్ల దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులు పసుపు, కుంకమలతో మొక్కులు చెల్లించారు. ఎన్నిల అలాగే రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు.

### గుడ్డిపలో 450 మందికి వైద్య సేవలు

**రావికమతం, ఫిబ్రవరి 27:** మండలంలోని గడ్డిప గ్రామంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో జనరల్ స్పెషలిస్టులు .వి.అశోక్‌కుమార్, గైనిక్ వైద్యులు డీఎంఎల్ స్మృతి, జె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొని 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.

### పొట్టిదొరపాలెంలో 354 మందికి...

**బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 27:** మండలంలోని పొట్టిదొరపాలెంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 354 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నేత్రాలు బీపీ, షుగర్, సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలను పంపిణీ చేశారు. శిబిరంలో బుచ్చెయ్యపేట వైద్యాధికారి కె.రమేష్ పాల్గొన్నారు.

### డైనింగ్ హాలుకు రూ.25 లక్షలు

**చోడవరం, ఫిబ్రవరి 27:** స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో డైనింగ్ హాలు నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్ నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులకు సంబంధించిన కాపీని ఏపీటీఎఫ్ నాయకులు వెంకటపతిరాజు మంగళవారం అందించారు.

# వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల ఆందోళన

» పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన



పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

**చోడవరం, ఫిబ్రవరి 27:** వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మేజర్ పంచాయతీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు. పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఆరు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా పనులు చేయించుకుంటున్న అధికారులు తీరును ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు విమర్శించారు. కుటుంబాలతో అవస్థలు పడుతున్న కార్మికులు వేతనాల కోసం అడిగితే పంచాయతీ అధికారులు వేధింపులకు గురిచేయడం దారుణమని మండిపడ్డారు. వేతన బకాయిలతో పాటు కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ కాంట్రిబ్యూషన్ నిధి కూడా పంచాయతీ చెల్లించకపోవడం వల్ల కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేతన బకాయిలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ పారిశుధ్య కార్మికులు అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం ప్రతినిధులు పొట్నూరు అప్పారావు, గణేష్, అప్పలరాజు, నాగు, లక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తాతయ్యబాబు

### భువనేశ్వరి యాత్రను విజయవంతం చేయాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు

**బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 27:** నియోజకవర్గంలో ఈ నెల 29వ తేదీన పర్యటించనున్న మాజీ సీఎం చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి నిజం గెలవాలి యాత్రను విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు కోరారు. భువనేశ్వరి కార్యక్రమం ఏర్పాట్లపై ఆర్.భీమవరంలో పార్టీ నాయకులతో మంగళవారం సమీక్షించారు. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో తీవ్ర మనస్తాపానికి గురై చనిపోయిన కుటుంబ సభ్యులను ఆమె పరామర్శిస్తారని చెప్పారు. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించేందుకు ఈ యాత్ర చేపట్టారన్నారు. ఈ సమీక్షలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, నాయకులు మలిరెడ్డి బుజ్జి, కె.సత్యనారాయణ, గొలగాని శ్రీనివాస్‌యాదవ్, వెలంకాయల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఎట్టకేలకు మంగళాపురం ఆయకట్ట పనులు



ఎక్స్‌కవేటర్‌తో మంగళాపురం ఆయకట్ట నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

**బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 27:** మంగళాపురం ఆయకట్ట నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు మంగళాపురం ఆయకట్ట కొట్టుకుపోవడంతో బుచ్చెయ్యపేట, చీడికాడ, చోడవరం మండలాలకు చెందిన సుమారు 3500 ఎకరాల్లో పంట దెబ్బతింది. మూడేళ్లుగా ఆయకట్ట పునర్నిర్మాణం చేపట్టాలన్న మూడు మండలాల రైతుల విజ్ఞప్తులు చేసినప్పటికీ, ఆర్థిక లేమి సమస్యల కారణంగా ఇరిగేషన్ శాఖ చేతులెత్తేయడంతో ఫలించేదన్న విషయం విదితమే. దీంతో మూడేళ్లు రైతుల పంట నష్టాలను చవిచూడక తప్పలేదు. సమస్యను ఎమ్మెల్యే ధర్మశ్రీ, ఎంపీ సత్యవతికి తెలపగా, రూ.40 లక్షల ఎంపీ నిధులను మంజూరు చేశారు. టెండరు ఖరారు కావడంతో సదరు కాంట్రాక్టరు పనులు చేపట్టారు. వచ్చే ఖరీఫ్‌లోగా పనులు పూర్తిచేస్తామని ఆయన తెలిపారు.

### బాలికలను రక్షిద్దాం.. చదివిద్దాం

**దేవరాపల్లి, ఫిబ్రవరి 27:** బాలికలను రక్షిద్దాం.. చదివిద్దాం అంటూ అంబేద్కర్ కాలనీ, జూనియర్ కళాశాల వద్ద మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. బాల్య వివాహాలు, బాలికల చదువులు, భ్రూణహత్యల నివారణ, బాలికల రక్షణ వంటి అంశాలపై ప్రజలకు కళాకారులు అవగాహన కల్పించారు. పర్యవేక్షకురాలు రాములమ్మ, సర్పంచ్ పెంటమ్మ, ఎంఈవో పడాల్ దాసు పాల్గొన్నారు.



చీడికాడ: సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

### టీడీపీ టికెట్టు ఎవరికి ఇచ్చినా విజయానికి కృషి

» చీడికాడ మండల నాయకుల ఏకగ్రీవ తీర్మానం

**చీడికాడ, ఫిబ్రవరి 27:** మాడుగుల నియోజకవర్గం టీడీపీ టికెట్టు ఎవరికి ఇచ్చినా గెలుపునకు కృషి చేస్తామని టీడీపీ మండల, గ్రామ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మండలంలోని పెదగోగాడ గ్రామంలో సీనియర్ నేత రెడ్డి రాము అధ్యక్షతన క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులతో మంగళవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ గెలుపే ముఖ్యమని వారంతా స్పష్టం చేశారు. మాడుగుల టిక్కెట్టును తెలుగుదేశం పార్టీలో ఉన్న ముగ్గురిలో ఎవరికి ఇచ్చినా, ఆఖరికి జనసేనకుగాని, బీజేపీకిగాని కేటాయించినా అందరూ ఐకమత్యంగా అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కాగా, మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట అయినప్పటికీ నాయకులు, కార్యకర్తల్లో సమన్వయం లేకపోవడంతోనే గత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఓటమిపాలయ్యారని సమావేశంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ కుప్పు కళావతి అన్నారు. మరో రెండు నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వాలు రావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, నాయకులు పి.కొండబాబు, బి.దేముడునాయుడు, పి.అప్పారావు, డి.అప్పలనాయుడు, గొర్లె గణేష్, కె.శ్రీరామ్మూర్తి, పి.రాజుబాబు, ఎస్.గంగునాయుడు, కె.నారాయణమూర్తి, రామరాజు యాదవ్, జి.రామునాయుడు, పి.ఎర్రునాయుడు, తాతబాబు, డి.బలరాం పాల్గొన్నారు.

### గవిరెడ్డికి టికెట్ ఇవ్వాలని వినతి

**కె.కోటపాడు:** మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు ఇస్తే భారీ మెజార్టీతో గెలిపిస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలో కె.కోటపాడు శివాలయం ఎదురుగా ఉన్న మాజీ సర్పంచ్ దోకల లక్ష్మీనరసింహమూర్తి అతిథి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కోటపాడు మండలానికి చెందిన టీడీపీ నాయకులు తీర్మానం చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కొండూరు నాగభూషణం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు వంటాకు దేముడుబాబు, బొజ్జంకి సూర్యనారాయణ, పైలా గోపి, అచ్చిబాబు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### గిరిజనులకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలి

**రోలుగుంట, ఫిబ్రవరి 27:** మండలంలోని కొండశిఖర గిరిజన గ్రామాలైన లోసింగి, పెదగరువు, పిత్రిగెడ్డ గ్రామాల్లో గిరిజనులకు గ్యాస్‌కనెక్షన్లు పొందడానికి నానా అవస్థలు పడుతున్నారని, వీరికి తక్షణమే ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను మంజూరు చేయాలని గిరిజన సంఘం నాయకులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. మంగళవారం లోసింగిలో గిరిజనులతో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో 150 వరకు గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం అందించే ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌ల కోసం రావికమతం, నర్సీపట్నం గ్యాస్ కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. ఉజ్వల పథకం కింద దరఖాస్తు చేసి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ మంజూరు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో పీవీటీజీ సంఘం మండల అధ్యక్షుడు గెమ్మెలి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాడుగుల నియోజకవర్గం

### ఘనంగా మోదకొండమ్మ జాతర



ఎడ్ల పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ రాజారాం... (ఇన్‌సెట్‌లో) పూజలు అందుకున్న మోదకొండమ్మ అమ్మవారు

**మాడుగుల, ఫిబ్రవరి 27:** ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయంలో వేకువజాము ఆరు గంటల నుంచి అమ్మవారిని కట్టుబొట్టు పూలదండలతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మరి కొంతమంది భక్తులు అమ్మవారి ఘటాలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే తీర్థం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, శ్రీనాద శ్రీనివాసరావు, దంగేటి సూర్యారావు, కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఎండ్ల పరుగు పందెంను ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం ప్రారంభించారు. వాలీబాల్, ఎడ్ల పరుగు పందెం పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందించారు. అలాగే తీర్థానికి వచ్చిన భక్తులు అలరించేందుకుగాను దేవి ఆడిటోరియం, దుర్గాలమ్మ ఎన్టీఆర్ కళాక్షేత్రం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

### దివ్యాంగుడికి రూ.5 లక్షలు మంజూరు



దివ్యాంగుడితో డిప్యూటీ సీఎం బూడి

**దేవరాపల్లి, ఫిబ్రవరి 27:** మండలంలోని ఏకొత్తపల్లి గ్రామానికి చెందిన కర్రి అప్పలనాయుడుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. రైలు ప్రమాదంలో అప్పలనాయుడుకు రెండు కాళ్లు పోయాయి. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, కర్రి అప్పనాయుడు గడపగడపకు కార్యక్రమానికి వెళ్లినప్పుడు అప్పలనాయుడు తన వేదనను వెల్లగక్కుకున్నాడు. పరిశీలించిన తరువాత ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఐదు లక్షలు మంజూరయ్యాయని సర్పంచ్ వెంకటరమణ తెలిపారు.

### కలిగొట్లలో 455 మందికి వైద్య పరీక్షలు

**దేవరాపల్లి, ఫిబ్రవరి 27:** మండలంలోని కలిగొట్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 455 మందికి పరీక్షలు చేసినట్టు డాక్టర్ బి.హారిక తెలిపారు. వీరిలో 34 మందికి నేత్ర శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులు సురంద్ర, కల్యాణి, గోవిందరెడ్డి తదితరులు రోగులకు పరీక్షలు చేసి మందులు ఇచ్చినట్టు చెప్పారు.

### పల్స్ పోలియోకు సహకరించాలి

**దేవరాపల్లి, ఫిబ్రవరి 27:** మండలంలో వచ్చే నెల 3న జరగనున్న పల్స్ పోలియోకు అందరూ సహకరించాలని వైద్యులు పూజిత, మేఘన కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బందికి మంగళవారం అవగాహన కలిగించారు. ఎంపీడీవో సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.